క్లుప్తంగా

14న కల్యాణోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో ఈ నెల 14న సాయంత్రం శ్రీ కామేశ్వరిదేవి సమేత శ్రీ మహానందీశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రాంమోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. మహానంది క్షేత్రం దేవస్థానం ఆధ్వర్యంలో, వేద పండితులు, అర్చకులు సారథ్యంలో ఆర్యవైశ్యసభ సహకారంతో కల్యాణోత్సవం ఉంటుందన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రతి ఒక్కరూ మొక్కలను విరివిగా నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని రాణి తిరుమల దేవి డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. అజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా బుధవారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటేశ్వరరెడ్డి విద్యార్థులతో పంచప్రాణ్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ తరుణేందు శేఖర్, సుబ్బరాయుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

తగ్గిన టమాటా ధర

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మార్కెట్‌లో బుధవారం కిలో టమాటా ధర రూ.70 పలికింది. గత వారంలో అమాంతం కిలో రూ.150 వరకు పెరిగిన టమాటాలు గత మూడు రోజులుగా తగ్గుముఖం పట్టాయి. ముందుగా మదనపల్లె, గుర్రంకొండ ప్రాంతాల నుంచి టమాటాలు మార్కెట్‌కు వచ్చేవి. ప్రస్తుతం మైదుకూరు, ముద్దనూరు, పులివెందుల ప్రాంతాల్లో పంట దిగుబడి రావడంతో రోజురోజుకు ధర తగ్గుతోంది.

ఘనంగా మేరా మట్టీ మేరా దేశ్

ప్రొద్దుటూరు : మండలంలోని గోపవరం వద్ద ఉన్న ప్రభుత్వ పశువైద్య కళాశాలలోని ఎన్ఎస్ఎస్, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వైకుంఠరావు ఆధ్వర్యంలో బుధవారం మేరా మట్టీ మేరా దేశ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ నాలుగు విభాగాల్లో ఒక్కో విభాగం తరపున 75 మొక్కలను కళాశాల ప్రధాన భవన ప్రాంగణం, పశువైద్య బోధన, చికిత్స సముదాయం, బాలికల వసతి గృహం, గోపవరం గ్రామ పంచాయతీలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు మొక్కలు నాటారు. అనంతరం మట్టిదీపాలతో పంచ్ ప్రాణ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారులు డాక్టర్లు పి.విద్యాసాగర్, పి.రేవతి, వి.మానస, ఎస్.వాణి, గోపవరం గ్రామ సర్పంచ్ గద్ద మోషా పాల్గొన్నారు.

పోస్టాఫీసులో త్రివర్ణ పతాకాలు

ప్రొద్దుటూరు కల్చరల్ : పోస్టాఫీసు ద్వారా త్రివర్ణ పతాకాలను అందిస్తున్నట్లు ప్రొద్దుటూరు ప్రధాన తపాల శాఖ సూపరింటెండెంట్ జి.కిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత ప్రభుత్వం ప్రతి పౌరుడిని ఈ వేడుకల్లో భాగస్వామి చేయాలని 'హర్ ఘర్ తిరంగా' ప్రచారాన్ని చేపట్టిందని ఆయన పేర్కొన్నారు. జాతీయ పతాకాన్ని ప్రతి పౌరుడికి అందుబాటులో ఉండేలా పోస్టాఫీసు నుంచి పొందుటకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. నామమాత్రపు ధర రూ.25 అందిస్తున్నామని, ఈ పోస్టాఫీసు సైట్ ద్వారా జాతీయ పతాకాన్ని ఆన్‌లైన్ ద్వారా పొందవచ్చునని వివరించారు.

మొక్కలు నాటిన వైద్య సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం : మేరా మిట్టి మేరా దేశ్ సందర్భాన్ని పురస్కరించుకొని శ్రీనివాసనగర్ అర్బన్ సెంటర్‌లో బుధవారం డాక్టర్ దినేష్‌బాబు మొక్కలను నాటారు. అనంతరం పీఎంఎస్ఎంఏ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సమతుల్య ఆహారం గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ రవిశంకర్‌రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏబీవీపీ డిగ్రీ కళాశాల నూతన కమిటీ

పోరుమామిళ్ల : ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఏబీవీపీ నూతన కమిటీని జిల్లా కన్వీనర్ అభిలాష్ అధ్యక్షతన బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మోహన్, కార్యదర్శిగా నాగేంద్రను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అభిలాష్ తెలిపారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి నూతన కమిటీ కృషి చేస్తుందని ఆయన తెలిపారు.

సీఐటీయూ ధర్నా

ప్రొద్దుటూరు : స్థానిక పాత బస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సేవ్ ఇండియా అని సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, కార్యదర్శి విజయ్‌కుమార్ మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చి కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కోడ్‌లను తీసుకొచ్చి కార్మికుల నడ్డి విరిచిందని విమర్శించారు. ప్రభుత్వ ఆస్తులను కారుచౌకగా ప్రైవేటు వారికి దారాదత్తం చేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు చంటి, ప్రధాన కార్యదర్శి సాల్‌మోన్ తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో...

పోరుమామిళ్ల : స్థానిక పోస్టాఫీసు వద్ద బుధవారం సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని, నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భైరవప్రసాద్ ఆధ్వర్యంలో పోస్టుమాస్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సుందరం, రత్నం, రమాదేవి, లూర్దుమేరి, లక్షుమ్మ, రేణుకాదేవి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

బద్వేలు అర్బన్ : గర్భిణులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ వై.చంద్రహాసరెడ్డి పేర్కొన్నారు. బుధవారం తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎంఎస్ఎంఏ కార్యక్రమం ద్వారా గర్భిణులకు ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు అందిస్తూ తగు సూచనలు ఇవ్వాలన్నారు. ప్రసవ సమయం ముందుగానే తెలియజేసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారికి మెరుగైన వైద్యంతో పాటు సూచనలు, సలహాలు ఇవ్వాలని సూచించారు. అలాగే నా మట్టి – నా దేశం కార్యక్రమంలో భాగంగా జాతీయ జెండాను ఎగురవేసి ఆరోగ్య కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ జోత్స్నస్వర్ణలత, డాక్టర్ వినయ్‌కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటమ్మ, హెల్త్ అసిస్టెంట్ జనార్ధన్‌రావు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



పీహెచ్‌సీలో వైద్యాధికారులకు సూచనలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ చంద్రహాసరెడ్డి

ప్రభుత్వాసుపత్రుల్లో కాన్పు సురక్షితం

ప్రొద్దుటూరు క్రైం : ప్రభుత్వాసుపత్రుల్లో కాన్పు కావడం సురక్షితమైందని డాక్టర్ సుస్మిత తెలిపారు. మండల పరిధిలోని కామనూరు పీహెచ్‌సీలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. హైరిస్కు ఉన్న వారికి వైద్యులు తగు సూచనలు చేశారు. డాక్టర్ సుస్మిత మాట్లాడుతూ ప్రతి నెలా వైద్య పరీక్షలు చేయించుకోవాలని గర్భిణులకు సూచించారు. బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు చల్లా రాజగోపాల్ గర్భిణులకు భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్, సీహెచ్‌ఓ కృష్ణమ్మ పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ ..

ఈ నెల 10న నిర్వహించనున్న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని మండల అభివృద్ధి అధికారి రహమతుల్లా కోరారు. బుధవారం టాస్క్‌ఫోర్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ 10వ తేదీన అన్ని కళాశాలలు, పాఠశాలలు, అంగన్‌వాడి కేంద్రాల్లో 1–19 ఏళ్ల పిల్లలకు నులిపురుగుల నివారణ కోసం అల్‌బెండజోల్ మాత్రలను వేస్తారన్నారు. డాక్టర్ హనీఫ్‌బాబా, ఎంఈఓ సావిత్రమ్మ మాట్లాడారు. అనంతరం నులిపురుగుల నివారణ దినోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు.

కమనీయంగా కల్యాణోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శివాలయం వీధిలోని దత్తాత్రేయస్వామి ఆలయంలో బుధవారం శ్రీ పాద వల్లభ సేవా సంఘం ఆధ్వర్యంలో అనఘాష్టమి సందర్భంగా దత్తాత్రేయస్వామి, అనఘాదేవిల కల్యాణోత్సవాన్ని కమనీయంగా నిర్వహించారు. వేకువజామున దత్తాత్రేయ స్వామి మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం దత్తాత్రేయస్వామి, అనఘాదేవిల ఉత్సవ మూర్తులకు ఆలయ ప్రధానార్చకులు రామాచారి శాస్త్రోక్తంగా కళ్యాణోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వినియోగం జరిగింది. కార్యక్రమంలో శ్రీపాద వల్లభ సేవాసంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని ఆర్డీఓకు వినతి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

బద్వేలు అర్బన్ : పట్టణంలో శాశ్వత భవనంలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం ఆర్డీఓ ఆకుల వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని మాట్లాడుతూ నియోజకవర్గం ముఖ్య కేంద్రమైన బద్వేలు పట్టణంలో అన్ని వసతులతో కూడిన గ్రంథాలయం లేకపోవడంతో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగ యువత ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇందుకు స్పందించిన ఆర్డీఓ పట్టణంలో త్వరలోనే అనువైన స్థలాన్ని ఎంపిక చేసి డిజిటల్ లైబ్రరీని ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్‌షరీఫ్, నాగార్జున, ఉపాధ్యక్షులు గురవయ్య, సురేష్, సహాయ కార్యదర్శులు సుబ్రమణ్యం, ఆంజనేయులు, కోశాధికారి సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అమరవీరులను స్మరించుకోవడం బాధ్యతగా భావించాలి



ప్రభుత్వాసుపత్రి ఆవరణలో జాతీయ జెండా ఎగురవేస్తున్న డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ రాంప్రసాద్

బద్వేలు అర్బన్ : దేశ స్వాతంత్ర్యం కోసం, దేశం కోసం ప్రాణాలు అర్పించిన దేశ నాయకులను, అమరవీరులను స్మరించుకోవడం ప్రతిఒక్కరు బాధ్యతగా భావించుకోవాలని ప్రభుత్వాసుపత్రి డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ సి.రాంప్రసాద్ పేర్కొన్నారు. నా మట్టి – నా దేశం కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక ప్రభుత్వాసుపత్రి ఆవరణలో జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి వైద్యులు డాక్టర్ రామలక్ష్మి, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ నిఖిల్, డాక్టర్ అవినాష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలించిన అడిషనల్ డీఎంహెచ్‌ఓ

దువ్వూరు : ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే వారు పేదవారు కాబట్టి వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని అడిషనల్ డీఎంహెచ్ ఖాదర్ వలి తెలిపారు. దువ్వూరు ప్రాథమిక కేంద్రంలో బుధవారం 'మేరి మిట్టి – మేరి దేశ్' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జెండా వందనం చేశారు. అనంతరం సిబ్బందితో కలసి ఆయన మొక్కలు నాటారు. ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించి సిబ్బందికి ఖాదర్‌వలి పలు సూచనలు చేశారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్జేడీ బాబు

మైదుకూరు : కడప, చిత్తూరు జిల్లాల ఉన్నత విద్యాశాఖ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి డాక్టర్ పి.బాబు బుధవారం మైదుకూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను బుధవారం తనిఖీ చేశారు. పలు రికార్డులను ఆయన పరిశీలించారు. విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ కళాశాలలోని మౌలిక సదుపాయాలపై, అధ్యాపకుల బోధన పద్ధతిపై ఆరా తీశారు. అంతే కాకుండా అధ్యాపకులకు పరిశోధన పత్రాలను, కార్యశాలలను, సదస్సులను నిర్వహించి తద్వారా విద్యార్థులలో స్ఫూర్తిని నింపాలని ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరెడ్డికి సూచించారు. అనంతరం మేరా మట్టి మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా కళాశాల ఆవరణంలో ఆర్జేడీ బాబు, ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులతో కలసి మొక్కలు నాటారు.

నేటి నుంచి ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వేడుకలు

కలసపాడు : ఈనెల 10 నుంచి మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో ఆజాదికా అమృత్ మహోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మహబూబ్‌బీ తెలిపారు. 10న పుల్లారెడ్డిపల్లె, పెండ్లిమర్రి, 11న శంఖవరం, రాజుపాలెం, లింగారెడ్డిపల్లె, కలసపాడు, ఇ.తంబళ్ళపల్లె, ఇ.రామాపురం, చింతలపల్లె, 14న తెల్లపాడు, చెన్నుపల్లె, పిడుగుపల్లె గ్రామ పంచాయతీల్లో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. నా మట్టి – నా దేశం, నేలతల్లికి నమస్కారం- వీరులకు వందనం ఆజాదికా అమృత్ మహోత్సవ వేడుకలను నిర్వహించుటకు కేంద్ర ప్రభుత్వం కొన్ని మార్గదర్శకాలను జారీ చేసిందన్నారు. ప్రజల్లో దేశ భక్తిని ప్రేరేపించేందుకు, వారిని ఉత్తేజపరిచేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అట్లూరులో..

అట్లూరు : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆజాదికా అమృత్ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా నా మట్టి – నా దేశం కార్యక్రమంలో జాతీయ జెండాను ఎగురవేశారు. వైద్యాధికారి కె.హమీదబేగం ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది పీహెచ్‌సీలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సి.మురళీకృష్ణ, పీహెచ్ఎన్ ఎం.లక్ష్మిదేవి, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బి.కోడూరులో..

బి.కోడూరు : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆజాదికా అమృత్ మహోత్సవంలో భాగంగా దేశ అమరవీరుల గౌరవార్థం నా మట్టి – నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు, డాక్టర్ ఉదయ్‌కిరణ్‌లు జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం పీహెచ్‌సీ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నాగమణి, పీహెచ్ఎన్ పుష్పాంజలి, హెల్త్ సూపర్‌వైజర్లు జాన్‌విలియం, విజయలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ రామచంద్రయ్య, ఎల్‌డీసీ రాజమ్మ, హెచ్ఏ రామతీర్థం, ఫార్మసిస్టు వెంకటేశ్వర్లు, స్టాఫ్‌నర్సులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలి

డీఈఓ రాఘవరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : బాల్యం నుంచే విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని జిల్లా విద్యాశాఖాధికారి వై.రాఘవరెడ్డి పేర్కొన్నారు. బుధవారం శ్రీవెంకటేశ్వర డిగ్రీ కాలేజీలో ప్రొద్దుటూరు డివిజన్ పరిధిలోని ప్రైవేటు పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులకు ఇన్‌స్పైర్ మనాక్ నామినేషన్ల ప్రక్రియపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. డీఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల్లో వినూత్న ఆలోచనలను ప్రోత్సహించాలని సూచించారు. నిజ జీవితంలో ఎదురయ్యే సమస్యలను విద్యార్థులు పరిష్కరించేలా తీర్చిదిద్దాలన్నారు. ఇన్‌స్పైర్ మనాక్‌కు ప్రతి పాఠశాల నుంచి 5 నామినేషన్లను పంపాలని, ఏ పాఠశాలకు మినహాయింపు లేదని చెప్పారు. కడప డిప్యూటీ ఈఓ రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఇన్‌స్పైర్ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. ఎంఈఓ సావిత్రమ్మ మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఇన్‌స్పైర్ కార్యక్రమానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. అనంతరం జిల్లా సైన్స్ అధికారి మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఇన్‌స్పైర్ మనాక్‌లో నామినేషన్లు ఎలా వేయాలి, సమస్యలు ఏమిటి, ఎలా పరిష్కరించాలి, రాష్ట్ర, జాతీయ స్థాయి ప్రాజెక్టుల ఎంపిక ఎలా జరుగుతుందో వివరించారు. ఈ కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు, సీఆర్పీలు భాస్కర్, వరప్రసాద్, నాగేంద్ర పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ రాఘవరెడ్డి

భగత్‌సింగ్ కాలనీలో ఆక్రమణల తొలగింపు



జేసీబీతో ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు : గోపవరం గ్రామ పంచాయతీ పరిధిలోని భగత్ సింగ్ కాలనీలో రోడ్డు వెంబడి ఆక్రమణల తొలగింపునకు అధికారులు బుధవారం శ్రీకారం చుట్టారు. ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ నుంచి మల్లేలమ్మ గుడి వరకు రూ.83లక్షల వ్యయంతో రోడ్డు, డ్రైనేజీ కాలువ పనులు మంజూరయ్యాయి. ఈ పనుల నిర్వహణకు సంబంధించి భగత్ సింగ్ కాలనీలో రోడ్డు వెంబడి జేసీబీతో ఆక్రమణల తొలగింపు చర్యలు చేపట్టారు. ఉప సర్పంచ్ రాఘవరెడ్డి, ఎంపీటీసీ వసుంధర రాజకుల్లాయప్ప, ఆర్ఐ నాగమోహన్, వీఆర్‌ఓలు పనులను పర్యవేక్షించారు.

లేగదూడల ప్రదర్శన

రాజుపాళెం : మండలంలోని టంగుటూరు గ్రామంలోని పశువుల ఆసుపత్రిలో బుధవారం నిర్వహించిన లేగదూడల ప్రదర్శన విజయవంతమైందని చైర్మన్ ఆర్.మాధవ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమ ఎంతో తోడ్పాటు నిస్తుందన్నారు. డీఎల్‌డీఏ ఉప సంచాలకులు డాక్టర్ జి.రమేష్ మాట్లాడుతూ పెయ్య దూడలను ఉత్పత్తి చేసే ఎదసూదుల గురించి వివరించారు. పెద్దముడియం, రాజుపాళెం మండలాల ఏడీఏ డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ లేగ దూడల సంరక్షణ గురించి రైతులకు తెలిపారు. ఉత్సాహవంతంగా ఉన్న లేగ దూడలను రైతులు ప్రదర్శనకు తీసుకొచ్చారు. అందులో ఆరోగ్య వంతమైన దూడలకు బహుమతులు, మందులు, విటమిన్ టానిక్‌లు అందజేశారు. ఇందులో మొత్తం 75 లేగ దూడలు ప్రదర్శనకు వచ్చాయి. కార్యక్రమంలో సర్పంచ్ బాబు, గాదెగూడూరు, కొర్రపాడు పశువైద్యాధికారులు ప్రదీప్ కుమార్ రెడ్డి, లక్ష్మిదేవి, పశుగణాభివృద్ధి సంఘం డాక్టర్ శివరామిరెడ్డి, పశువైద్య సిబ్బంది సిద్దేశ్వరి, మహబూబ్ బాష, అశోక్, ఆరీఫ్, ట్రైనింగ్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



టంగుటూరులో లేగ దూడల ప్రదర్శన

శిలాఫలకాలు ఏర్పాటు చేయాలి

చాపాడు : నా భూమి నా దేశంలో కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీలో నేల తల్లికి నమస్కారం – వీరులకు వందనం శిలాఫలకాన్ని ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ శ్రీధర్ నాయకుడు తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఆగస్టు 15వ తేదీ వరకు నిర్వహిస్తున్న నేతల్లికి నమస్కారం – వీరులకు వందనం కార్యక్రమంలో భాగంగా ఖాళీ ప్రదేశాల్లో చెట్లను నాటడం, స్వాతంత్ర్య సమరయోధుల పిల్లలను సన్మానించడం, ప్రతిజ్ఞ, జెండా వందనం చేసి ప్రతి పంచాయతీ నుంచి మట్టి నమూనాలను సేకరించాలని సూచించారు.

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి

డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్

ప్రొద్దుటూరు : మహిళలను వ్యాపారవేత్తలుగా చేయడమే లక్ష్యంగా పనిచేయాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఆనంద్‌నాయక్ తెలిపారు. ప్రొద్దుటూరు మండలంలోని వైఎస్సార్ క్రాంతి పథం మండల సమాఖ్య కార్యాలయంలో బుధవారం నిర్వహించిన డ్వాక్రామహిళల శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను వ్యాపారవేత్తలుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం విరివిగా రుణాలను మంజూరు చేస్తోందన్నారు. ఫైనాన్షియల్ మేనేజ్ మెంట్ ద్వారా శిక్షణ ఇవ్వడంతోపాటు వ్యక్తిగత రుణాలను ఇప్పిస్తున్నామన్నారు. డ్వాక్రా సంఘం ష్యూరిటీతో ఉమెన్ లెడ్ ఎంటర్‌ప్రైనిర్ ద్వారా రూ.10 లక్షల వరకు రుణాలను పొందవచ్చునని తెలిపారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. మహిళల సాధికారితకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. సమావేశంలో ఏపీఎంలు వెంకటసుబ్బమ్మ, నాగేంద్ర, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రాజెక్టు డైరెక్టర్ ఆనంద్ నాయక్

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

చాపాడు : ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందించే వైద్య సేవలను గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ తెలిదెల లక్ష్మయ్య తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ వైద్య శిబిరం నిర్వహించారు. 90 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అన్ని రకాల వసతులు ఉన్నాయని తెలిపారు. ఇక్కడే ప్రతి నెల వైద్య పరీక్షలు, ప్రసవాలు ఇక్కడే చేయించుకోవాలని సూచించారు. మండల వైద్యాధికారి రాజేష్ కమార్ మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా పల్లవోలు గ్రామానికి చెందిన వైస్ఎంపీపీ ప్రసాద్, కళావతి దంతపతులు గర్భిణులకు సీమంతం నిర్వహించి భోజన సౌకర్యం కల్పించారు. సీహెచ్‌ఓ మహదేవ యాదవ్, ఎఫ్‌పీసీ పర్యవేక్షకులు భాస్కర్, నారాయణరెడ్డి, రమేష్, వైద్య సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు రామసుబ్బారెడ్డి, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గర్భిణులకు భోజనం వడ్డిస్తున్న ఎంపీపీ, వైస్ ఎంపీపీలు

ఫ్యాప్టో ధర్నాను విజయవంతం చేయండి

మైదుకూరు : ఉపాధ్యాయుల సమస్యలపై ఈనెల 12వ తేదీ కడప కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఎస్టీయూ నాయకులు కోరారు. ధర్నాపై బుధవారం సాయంత్రం మైదుకూరులో ఎస్టీయూ నాయకులు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, ఫ్యాప్టో కోశాధికారి వై.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని కోరారు. జీఓ నంబర్ 117ను రద్దు చేయాలని, విద్యారంగాన్ని పరిరక్షించాలని కోరారు. సమావేశంలో ఎస్టీయూ రీజియన్ కన్వీనర్ బీకే సురేష్, మండల అధ్యక్షుడు కేవీ రాజు, ఆర్థిక కార్యదర్శి ఈశ్వరయ్య, ఎస్టీయూ సీనియర్ నాయకులు రాధా నరసింహారాజు, రాజ్‌కుమార్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

మైదుకూరు : ఇటీవల మృతి చెందిన మైదుకూరు మండల జాండ్లవరం గ్రామానికి చెందిన కాలువపల్లె వెంకటన్న కుటుంబానికి బుధవారం మాదిగ ఉద్యోగుల సంఘం నాయకులు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంకటన్న 20 ఏళ్లుగా ఎంఆర్‌పీఎస్ ఉద్యమంలో క్రియాశీలకంగా వ్యవహరించి.. ఎన్నో పోరాటాలు చేశారని అన్నారు. కె.సాల్మన్, ఈరీ జోసేష్, గొల్లపల్లి భాస్కర్, చుక్క ఓబులేసు, యల్లుగాల్ల బాలాజీ పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే సీఎం వైఎస్ జగన్ ధ్యేయం

ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



సంక్షేమ పథకాల లబ్ధిని మహిళలకు వివరిస్తున్న ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

మైదుకూరు : రైతు సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. అందుకే ఆయన రాష్ట్రంలో వ్యవసాయాన్ని పండుగ చేశారని ఆయన పేర్కొన్నారు. బుధవారం మండలంలోని తువ్వపల్లె పంచాయతీలో ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీలోని జాండ్లవరం, బీసీ కాలనీ, వీఆర్‌ఓ కాలనీ, ఎస్సీ కాలనీల్లో ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాల ద్వారా పొందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు 2014 ఎన్నికలకు ముందు రైతు రుణాలను మాఫీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక మోసం చేశాడని ఆరోపించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో రైతులు పడుతున్న అగచాట్లను గమనించారని, అందుకే అధికారంలోకి రాగానే రైతు సంక్షేమం కోసం అనేక పథకాలను, కార్యక్రమాలను రూపొందించి అమలు చేశారని కొనియాడారు. పంచాయతీలోని జాండ్లవరంలో మాజీ ఎంపీపీ మాచుపల్లె రామసుబ్బానాయుడు ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే ఆయనతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకుడు ముత్యాల ఎల్లారెడ్డి ఎమ్మెల్యే, ఆయన తనయుడు శెట్టిపల్లె నాగిరెడ్డిలను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

ఆర్‌బీకే, విలేజ్ క్లినిక్‌ల ప్రారంభోత్సవం

తువ్వపల్లెలో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, వ్యవసాయ శాఖ ప్రభుత్వ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు ఆర్‌బీకే, విలేజ్ క్లినిక్ భవనాల్లోని గదులను పరిశీలించి రైతులు, పంచాయతీ ప్రజలు ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ థామస్, వైస్ఎంపీపీ ఊటుకూరు రఘురామిరెడ్డి, సర్పంచ్ కాల్వపల్లె మాధవి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మూలే సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఏవీ సుబ్బారెడ్డి, మండల కన్వీనర్ గల్లా నరసింహారెడ్డి, బండి నాగేంద్ర ప్రసాద్, సుబ్బిరెడ్డి, ఎంఎస్ఆర్, వేణుగోపాల్ రెడ్డి, రామశివారెడ్డి, కాలువపల్లె వెంకటయ్య, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులు పూర్తి చేయండి

మండలంలోని గ్రామాల్లో మంజూరైన అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. బుధవారం మైదుకూరు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామాల్లో పర్యటించినప్పుడు ప్రజలు తన దృష్టికి తెచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు డ్రైనేజీ కాలువలు, పైపులైన్లు తదితర పనులకు రూ.26 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. సమావేశంలో ఎంఈఓ-2 నరహరి శర్మ మాట్లాడారు. మండలంలో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాలు, ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్‌ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని పలువురు సర్పంచ్‌లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ఆయన ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. వాటి నిర్మాణంలో అంచనా వ్యయాన్ని ప్రభుత్వం పెంచిందని ఎమ్మెల్యే వెల్లడించారు. సమావేశంలో తహసీల్దార్ అనురాధ, ఉద్యాన అధికారి రామకృష్ణ పంచాయతీరాజ్ ఏఈ మధుసూదన్ బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భరత్‌కుమార్‌రెడ్డి, విద్యుత్ ఏఈ రామభద్రయ్య, హౌసింగ్ ఏఈ బ్రహ్మానందరెడ్డి, ఉపాధి ఏపీఓ లక్ష్మీనారాయణ, వనిపెంట వైద్యాధికారి శ్రీకాంత్, మండల పశువైద్యాధికారి సుధాకర్ తమ శాఖల అభివృద్ధిని వివరించారు. సమావేశంలో వ్యవసాయ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్ రెడ్డి, జెడ్పీటీసీ అట్లూరు ప్రసన్న లక్ష్మి, ఎంపీపీ థామస్, వైస్ ఎంపీపీ ఊటుకూరు రఘురామిరెడ్డి, నానుబాల చిన్న కొండమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మూలే సుధాకర్‌రెడ్డి, ఎంపీడీఓ ఏవీ రమణారెడ్డి, వ్యవసాయ అధికారి లక్ష్మీప్రసన్న, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

మైదుకూరు : మైదుకూరుకు చెందిన శీలం పద్మ అనే మహిళకు సీఎం సహాయ నిధి నుంచి అందిన చెక్కును బుధవారం ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అందించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బాధితురాలు బంధువు శీలం సుబ్బరాయుడుకు ఎమ్మెల్యే సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి అందిన రూ. 3లక్షల చెక్కును అందజేశారు.